RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :210 EDITOR: CHERUKU UPENDAR, DATE : FRIDAY 15 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 210 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 15 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

దంచి కొట్టిన భారత్.. తొలి రోజు ఆట

ముగిసే సరికి 410/7

ముంబై - ప్రభాత సూర్యుడు: భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ముంబైలో జరుగుతున్న మొదటి టెస్టులో భారత మహిళా జట్టు దంచి కొటింది. మొదటి రోజు ఆట ముగిసే సరికి 410/7గా ఉంది. దీప్తీ 60, పూజా 4 పరుగుల మీద బ్యాటింగ్ చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 25

మిగతా 2లో

యుద్ధం తీవ్రరూపం..!

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు: ఇజ్రాయెల్– పాలస్తీనా మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది..ఇజ్రాయెల్ ప్రతీకార దాడులతో పాలస్తీనా గజగజ వణికిపోతోంది..ఖాన్ యూనిస్ నగరం బాంబులు, కాల్పుల మోతతో దద్దరిల్లుతోంది. ఇప్పటివరకు 7 వేల మందికిపైగా హమాస్ మిలిటెంట్లను హతమార్చింది ఇజ్రాయెల్.! గాజా నగరం శవాలదిబ్బగా మారిపోతోంది..గాజాలో ఇప్పటివరకు 17వేల మందికి పైగా మరణించారు. అదే సమయంలో 46 వేల మందికి పైగా గాయపడ్డారు.. గాజాలో ఆహారం, నీరు, నిత్యావసరాల కొరత తీవ్రంగా ఉంది. మానవతా సాయం అందక గాజా జనాభాలో 90 శాతం మంది ప్రతిరోజు తిండి



మిగతా 2లో

సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకునేందుకే..!

- రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర జోక్యాన్ని సవాలుచేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించటంపై కేరళ సీఎం

తిరువనంతపురం - ప్రభాత సూర్యుడు: కేంద్రంపై సుప్రీంకోర్టులో పోరాటాన్ని 'చారిత్రాత్మక యుద్ధం'గా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకునేందుకే ఈ చర్య తీసుకున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. కొట్టాయం జిల్లాలో గురువారం జరిగిన నవకేరళ సదస్సులో పాల్గొన్న విజయన్ మీడియాతో మాట్లాడారు. కేరళను

మిగతా 2లో

అంగన్వాడీలకు గుడ్‌న్యూస్ చెప్పిన మంత్రి సీతక్క

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ధనసరి అనసూయ అలియాస్ సీతక్క బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో వేదమంత్రోచ్ఛరణాల మధ్య ఆమె మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలి ఫైల్ మీద సంతకం పెట్టారు. ఈ మేరకు ఆమె అంగన్వాడీలకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇప్పటివరకు మినీ అంగన్వాడీలుగా ఉన్న కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తూ రూపొందించిన ఫైలుపై మంత్రి సీతక్క తొలి సంతకం చేశారు. ఆమె నిర్ణయంతో 3,989 మినీ అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మారనున్నాయి.. మరోవైపు అంగన్వాడీ టీచర్లకు కూడా మంత్రి సీతక్క

మిగతా 2లో

వారంలోనే..రేవంత్ దూకుడు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన మొదలుపెట్టి వారం రోజులు పూర్తయింది. వారంలోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు హామీలను అమల్లోకి తెచ్చేసింది. మిగిలిన వాటిని అమలు చేసేందుకు.. గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేసుకుటోంది కాంగ్రెస్ ప్రభుత్వం.డిసెంబర్ 3న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 64 స్థానాల్లో విజయకేతనం ఎగువేసింది కాంగ్రెస్ పార్టీ. సొంతంగానే మెజారిటీ రావడంతో ఏ ఇబ్బంది లేకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. డిసెంబర్ 5న తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించింది కాంగ్రెస్ అధిష్టానం. డిసెంబర్ 7న తెలంగాణ కొత్త ముఖ్యమంత్రిగా అనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఎల్బీ స్టేడియంలో లక్షలాది మంది ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు రేవంత్‌రెడ్డి. ఆయనతో పాటు 11 మంత్రులు కూడా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజునే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది.

ఆరు గ్యారెంటీలకు సంబంధించిన ఉత్తర్వులపై సంతకం చేశారు. అలాగే వికలాంగురాలు అయిన రజినీకి

మిగతా 2లో

ఇవాళ కేసీఆర్ డిశ్చార్జి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారు. ఇంట్లో జారిపడిన ఘటనలో తుంటి ఎముక విరిగి పోవడంతో శస్త్రచికిత్స చికిత్స చేశారు హైదరాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు. ఆ తర్వాత నుంచి కేసీఆర్ వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కాస్త కుదుట పడటంతో ఇంటికి వెళ్లేందుకు వైద్యులు అనుమతించారు. శుక్రవారం ఆయన్ను డిశ్చార్జ్ చేయనున్నారు. ఆ తర్వాత కేసీఆర్ ఆసుపత్రి నుంచి ఆయన నేరుగా నందినగర్ లోని తన నివాసానికి వెళ్లనున్నారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్లు తెలిపారు. తన ఫామ్ హౌస్ లోని

మిగతా 2లో

బాధ్యతలు స్వీకరించిన పొంగులేటి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గఅహనిర్మాణ శాఖా మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వేముల వీరేశం, ఆదినారాయణ, బాలు నాయక్, ఆది శ్రీనివాస్, యశస్వినీ రెడ్డి తోపాటు పలువురు సీనియర్ నాయకులు రేణుకా చౌదరి, రామసహాయం సురేందర్ రెడ్డి, రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాస రాజు, సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ కె. అశోక్ రెడ్డి, సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జేడీలు జగన్, శ్రీనివాస్, వెంకట రమణ, డీడీ లు మధు సూధన్, హాష్మి, రాజా రెడ్డి, సీఐఈ రాధా కిషన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు మంత్రిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క బాధ్యతలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం పలు శాఖలకు భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేశారు. ఆర్టీసీలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన సబ్సిడీ కింద రూ.374కోట్ల నిధులను విడుదల చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి రూ.298కోట్లు, విద్యుత్ సబ్సిడీకి రూ.996కోట్లు, మేడారం జాతర ఏర్పాట్లకు రూ.75 కోట్ల నిధులను విడుదల చేస్తూ సంబంధిత దస్త్రాలపై భట్టి విక్రమార్క సంతకాలు చేశారు. అంతకుముందు మహాత్మా జ్యోతిబాపులే ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క దంపతులు గృహ ప్రవేశం చేశారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా శ్రీధర్ బాబు బాధ్యతలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా శ్రీధర్ బాబు గురువారం ఉదయం తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్ బాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్, గండ్ర సత్యనారాయణ శ్రీధర్ బాబును కలిశారు. అలాగే మంథని నియోజకవర్గంతో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శ్రీధర్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దంచి కొట్టిన భారత్.. తొలి రోజు ఆట

(మొదటిపేజీ తరువాయి)

పరుగుల వద్ద నీతి మందన్న, 47 పరుగుల వద్ద షెఫాలి వర్మ అవుట్ కావడంతో కష్టాల్లో పడింది. అనంతరం క్రీజులోకి వచ్చిన శుభా సతీష్, జెమిమా రోడ్రిగ్స్ ఇంగ్లాండ్ బౌలర్ల దాటిని ఎదుర్కొన్నారు. శుభా సతీష్ 69, జెమిమా రోడ్రిగ్స్ 68, హర్మన్‌ప్రిత్ కౌర్ 49, యస్తిక 66, స్నేహ 30 పరుగులు చేసి ఔటయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో లారెన్ బెల్ 2 వికెట్లు తీయగా కేట్ క్రాస్, నాట్ స్కివర్-బ్రంట్, షార్లెట్ డీన్, సోఫీ ఎక్లెస్టోన్ తలో వికెట్ తీసుకున్నారు.

యుద్ధం తీవ్రరూపం..!

(మొదటిపేజీ తరువాయి)

తినలేకపోతున్నారు.హమాస్‌ను పూర్తిగా నాశనం చేసే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ ప్రకటన తర్వాత ఇజ్రాయెల్ సైన్యం మరింత ప్రమాదకరంగా దాడులు చేయడం మొదలు పెట్టింది. 23 లక్షల గాజా జనాభాలో దాదాపు 85 శాతం మంది బతుకుజీవుడా అంటూ స్వస్థలాలను వదిలిపోయినా సరే ఇజ్రాయెల్ దాడులు తగ్గించడం లేదు..దాదాపు 834 కోట్ల విలువైన యుద్ధ ట్యాంక్ ఆయుధాలను ఇజ్రాయెల్‌కు అమ్మేందుకు అమెరికా అంగీకరించడం చూస్తుంటే ఇజ్రాయెల్ దూకుడు ఇప్పట్లో ఆగేలా లేదు..గాజాలో పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి.

సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకునేందుకే..!

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలోకి నెట్టేందుకే కేంద్రం 'వివక్షపూరితమైన, ప్రతీకార చర్యలు' చేపడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పునరుద్ధరించాలనే ఉద్దేశంతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా జోక్యం చేసుకుంటోందని పిటిషన్‌లో పేర్కొన్నామని అన్నారు. ఎగ్జిక్యూటివ్ చర్యలతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ ప్రక్రియపై నియంత్రణ తీసుకుందని, రాష్ట్రానికి రుణాలు తీసుకునే సొంత ఆర్థిక వ్యవస్థలను నియంత్రించే అధికారంలో జోక్యం చేసుకుంటోందని అన్నారు. కేంద్రం చర్యల వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని తగ్గించడానికి కేరళకు తక్షణమే రూ.26,226 కోట్లు కావాల్సి వుందని అన్నారు. సంక్షోభాన్ని అధిగమించేందుకు ఇది సరిపోదని, కేంద్రం తీసుకున్న చర్యల వల్ల వచ్చే ఐదేళ్లలో రూ. 2 లక్షల కోట్ల నుండి రూ. 3 లక్షల కోట్ల రవకు నష్టం వాటిల్లుతుందని అంచనా. ఇది ఐదేళ్ల కాలంలో రాష్ట్ర జిడిపిలో 20 శాతం నుండి 30 శాతం వరకు ఉంటుంది. దీని నుండి బయటపడకపోతే.. పరిమిత వనరులతో అభివద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని దశాబ్దాల తర్వాత కూడా కోలుకోలేని సంక్షోభంలోకి నెట్టివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాత్మక యుద్ధంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాలు, కేరళ సొసైటీ మద్దతుగా నిలవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో ఎలాంటి కోతలు ఉండవని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

అంగన్వాడీలకు గుడ్‌న్యూస్ చెప్పిన మంత్రి సీతక్క

(మొదటిపేజీ తరువాయి)

తీపి కబురు అందించారు. అంగన్వాడీ టీచర్ల జీతాలు పెంచుతూ నిర్ణయించిన ఫైల్ మీద కూడా సీతక్క సంతకం పెట్టారు. దీంతో ఇప్పటివరకు రూ.7,500 జీతం అందుకున్న అంగన్వాడీ టీచర్లు.. ఇప్పుడు రూ.13,500 జీతం అందుకోనున్నారు. మొదటి సంతకంతోనే మంత్రి సీతక్క తమ జీతాలు పెంచడంపై అంగన్వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

100 ఎకరాల్లో హైకోర్టు భవనం..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వచ్చే జనవరిలో తెలంగాణ హైకోర్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, ప్రభుత్వ ముఖ్య అధికారులతో హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలో సంబంధిత అంశంపై సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత హైకోర్టు భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవశ్యకతను చీఫ్ జస్టిస్, న్యాయవాదులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ పరిధిలో 100 ఎకరాల్లో హైకోర్టు నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని సీఎంను కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సంబంధిత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొత్త జిల్లాల్లో కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కూడా చొరవ చూపాలని చీఫ్ జస్టిస్, న్యాయవాదులు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న హైకోర్టు భవనం హెరిటేజ్ బిల్డింగ్ కాబట్టి దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని కూడా సీఎం గుర్తు చేశారు. ఆ భవనాన్ని రినోవేషన్ చేసి సిటీ కోర్టుకు లేదా ఇతర కోర్టు భవనాలకు వినియోగించుకునేలా చూస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎస్ శాంతి కుమారి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వారంలోనే రేవంత్ దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధి కల్పించే ఉత్తర్వుపై సంతకం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రమాణస్వీకారానికి ముందే ప్రగతిభవన్ పేరును... బీఆర్ అంబేద్కర్ ప్రజాభవన్‌గా మార్చారు. ప్రగతిభవన్ ముందున్న ఇనుప బారికేడ్లను కూడా తొలగించారు. ప్రమాణస్వీకారం చేసిన రోజు సాయంత్రమే కేబినెట్ సమావేశం కూడా నిర్వహించారు. ఆ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆరు గ్యారెంటీల అమలు, రైతులకు ఆర్థిక సాయం వంటి అంశాలపై చర్చించారు. ఇక 2014 నుంచి డిసెంబర్ 7 వరకు ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా 100 రోజుల్లో అన్ని హామీలను నెరవేరుస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు తెలిపారు. డిసెంబర్ 8న... విద్యుత్ శాఖపై రివ్యూ చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. డిస్కమ్‌లు దాదాపు రూ. 85 వేల కోట్ల అప్పుల్లో ఉన్నాయని అధికారులు చెప్పారన్నారు. ఇక ఇటీవల రాజీనామా చేసిన సీఎండీ ప్రభాకర్‌రావు సహా ఇతర అధికారుల రాజీనామాలు ఆమోదించొద్దని అధికారులకు సూచంచారు సీఎం రేవంత్‌రెడ్డి. 24 గంటల నిరంతర విద్యుత్ కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. డిసెంబర్ 9వ తేదీన ఉదయం ప్రమాణస్వీకారం చేసిన మంత్రులకు శాఖలు కూడా కేటాయించారు. అదే రోజున అసెంబ్లీ సమావేశం నిర్వహించారు. గెలిచిన ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు మాత్రం ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఓవైసీని అంగీకరించలేదు. ప్రమాణస్వీకారం చేయలేదు. అదే రోజు అంటే డిసెంబర్ 9న సోనియా జన్మదినం సందర్భంగా రెండు గ్యారెంటీలు అమల్లోకి తీసుకువచ్చింది రేవంత్‌రెడ్డి సర్కార్. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది. అలాగే... రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద వైద్య ఖర్చుల పరిమితిని 10 లక్షల వరకు పెంచింది. ప్రజాభవన్‌లో రోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమానికి వేలాది ప్రజలు వస్తున్నారు. తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. రోజూ గంటల నుంచి రెండు గంటల పాటు ప్రజాదర్బార్ జరుగుతోంది. తొలి రోజు సీఎం రేవంత్‌రెడ్డి కూడా ప్రజాదర్బార్లో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులకు శాఖలు కేటాయించడంతో... వారు బాధ్యతలు చేపట్టారు. రోజూ రివ్యూలు చేస్తూ... ఆయా శాఖల అధికారులతో వరుస సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా వరుస సమీక్షా సమావేశాలతో బిజీగా ఉన్నారు. ఒక్కో శాఖపై క్షుణ్ణంగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ పై కూడా రివ్యూ చేశారు. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనకు ఆదేశాలు జారీ చేశారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో... పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఏవిధమైన ఒత్తిడికి గురికాకుండా చూడాలని కూడా ఆదేశించారు.అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోనే ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలు అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మిగిలిన వాటి అమలుపైనా దృష్టిపెట్టింది. అయితే... వాటికి ఆర్థిక ఇబ్బందులు తప్పేలా కనిపించడంలేదు. విద్యుత్ రంగం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ అమలుపై చర్చించేందుకు సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో... విద్యుత్ రంగం మొత్తం అప్పులు సుమారు రూ.81,000 కోట్లు ఉన్నాయని, ఈ పథకం అమలుకు ఏటా రూ.4,000 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉందని అధికారులు ఆయనకు వివరించినట్లు సమాచారం. ఇక... బీపీఎల్ కుటుంబాలకు చెందిన మహిళలకు నెలకు రూ.2,500, రూ.500కు సిలిండర్, రైతులకు ఎకరాకు రూ.15,000, అలాగే, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, వరి పంటకు కనీస మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. నిరాశ్రయులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్లకు నెలకు రూ.4,000 పింఛన్, విద్యార్థులకు రూ.5లక్షల చొప్పున విద్యా భరోసా కార్డు వంటివి కూడా అమలు చేయాల్సి ఉంది. ఇవన్నీ చక్కబెట్టడం... ఆర్థికపరమైన ఇబ్బందులను దాటడం.. కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్న సవాళ్లు.ఇక... కాంగ్రెస్ ప్రభుత్వంపై అప్పుడే ప్రతిపక్షాలు విమర్శలు మొదలైపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రోజే.... రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని... ప్రశ్నిస్తోంది బీఆర్ఎస్ ప్రభుత్వం. రైతులు కల్లాల దగ్గర ఎదురుచూస్తున్నారని ఇంకెప్పుడు అమలు చేస్తారని విమర్శస్త్రాలను ఎక్కుపెట్టేసింది. ఇప్పుడే ఆట మొదలైందంటూ మాజీ మంత్రి కేటీఆర్ కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై... విమర్శలు విల్లు ఎక్కుపెట్టారు. ఈ పరిస్థితులను కాంగ్రెస్ ఎలా దాటుతుందో చూడాలి.

పాత అసెంబ్లీ భవనంలోనే కౌన్సిల్ సమావేశాలు : రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్ హెచ్ఆర్డీ)లోని ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజాభవన్‌లో ఉన్న ఆఫీసు కార్యాలయాన్ని కూడా ఉపయోగించుకుంటామన్నారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఉన్న ఖాళీ స్థలంలో సీఎం క్యాంపు ఆఫీసు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొత్తగా ఎలాంటి భవనాలు నిర్మించబోమని స్పష్టం చేశారు. శాసనసభ భవనాలను సమర్థంగా వినియోగించుకుంటామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం సాగుకు 12.. 14 గంటలకు మించి విద్యుత్ ఇవ్వలేదని చెప్పారు. శ్వేతపత్రం సహా అన్ని అంశాలపై అందరితో చర్చించి సమయం వచ్చినప్పుడు విడుదల చేస్తామన్నారు. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో ఉపయోగకరంగా ఉండదని, మరో రూట్‌లో మెట్రో ప్లాన్ చేస్తామని సీఎం వెల్లడించారు.

"శుక్రవారం బీఏసీ సమావేశం ఉంటుంది. శాసనసభ సమావేశాల ఎజెండాపై నిర్ణయం తీసుకుంటాం. పాత అసెంబ్లీ భవనంలోనే కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయి. ఇప్పుడు ఉన్న అసెంబ్లీ భవనంలోనే శాసనసభ సమావేశాలు నిర్వహిస్తాం. పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ఉండబోతోంది" అని సీఎం వివరించారు.

ఓయూలో విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పరిపాలనా భవనం వద్ద ముండ్లకంచెలను, బారికేడ్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. గురువారం ఓయూ లైబ్రరీ నుంచి వందలా మంది విద్యార్థులు ర్యాలీగా పరిపాలన భవనం వద్దకు చేరుకొని ధర్నా చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ముండ్లకంచెలు తొలగించేందుకు యత్నించారు. పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లా డుతూ.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఓయూలో వీసీ ప్రొ.రవీందర్ నియంతగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి వేదికైన ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో సభలు, సమావేశాలు పెట్టుకోకుండా ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశాస్త్రీయంగా అన్ని కోర్సుల ఫీజులు పెంచి పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువును దూరం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే యూనివర్సిటీలో మౌలిక వసతులు, పూర్తిస్థాయిలో శాశ్వత ప్రొఫెసర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం లేకుండా పరిపాలన భవనం చుట్టూ ముండ్లకంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఎన్నో ఏండ్లుగా యూనివర్సిటీలో పనిచేసిన కార్మికులను తొలగించి ఆ స్థానంలో బి సెక్యూర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని వీసీ విద్యార్థులను కలవకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ముండ్లకంచెలు, బారికేడ్లను తొలగించాలని విన్నవించుకున్నా పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు రీసెర్చ్, స్కాలర్స్ భారీ ర్యాలీతో వెళ్లి వాటిని తొలగించే ప్రయత్నం చేసినట్టు చెప్పారు. పరిపాలన భవనం వద్ద ముండ్లకంచెలను, బారికేడ్లను తొలగించే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, సాయంత్రం ఓయూ ఏసీపీ చొరవతో విద్యార్థులు వీసీ ఛాంబర్‌లో వీసీతో భేటీ అయ్యారు. వారి డిమాండ్‌లను వీసీ ముందు ఉంచారు.

ఇవాళ కేసీఆర్ డిశ్చార్జి

(మొదటిపేజీ తరువాయి)

బాత్రూమ్‌లో ప్రమాదవశాత్తు కాలు జారి పడటంతో కేసీఆర్ తుంటి ఎముక విరిగింది. యశోద ఆసుపత్రి వైద్యులు ఆపరేషన్ నిర్వహించి తుంటి ఎముకను రిప్లేస్ చేశారు. ఆసుపత్రిలో కేసీఆర్ ను రేవంత్ రెడ్డి, చంద్రబాబు, చిరంజీవి, చిన్న జీయర్ స్వామి, ప్రకాశ్ రాజ్ తదితర ప్రముఖులు పరామర్శించారు. ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత 6 రోజులుగా కేసీఆర్‌ను పరామర్శించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల మధ్య కేసీఆర్ తాజాగా ఓ వీడియోను కూడా విడుదల చేశారు. తెలంగాణ సమాజాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. తనను పరామర్శించేందుకు ఎవరూ రావద్దని కోరారు.కేసీఆర్ అభ్యర్థన మేరకు కొద్ది రోజులుగా ఆస్పత్రి పరిసరాల్లో తగ్గిన అభిమానుల తాకిడి ఇప్పుడు నందీనగర్‌లోని ఆయన నివాస వద్ద పెరిగే అవకాశం ఉంది. తమ అభిమాన నాయకుడు ఎప్పుడెప్పుడు కోలుకొని తమ మధ్యకు వస్తారా అని కార్యకర్తలు, అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకున్న బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ వాకర్ సాయంతో డాక్టర్ల పర్యవేక్షణలో నడుస్తున్నారు. హాస్పిటల్‌లోని తన రూమ్‌లో వాకర్‌తో కేసీఆర్ నడుస్తున్నారు. వేగంగా రికవర్ అవుతున్నారని తెలిపారు. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తామని, ఆయన మెడికల్‌గా స్టేబుల్‌గా ఉన్నారని, నార్మల్ఫుడ్ తింటున్నారని చెప్పారు. మరికొన్ని రోజులు ఫిజియోథెరపీ చేయాల్సి ఉంటుందని, శరీరం ఇట్లాగే సహకరిస్తే వేగంగా ఆయన సొంతంగా నడిచే అవకాశం ఉంది. పరిస్థితి క్రమంగా మెరుగుపడుతూండటంతో ఇక ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేదని డాక్టర్లు భావిస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున పరామర్శించేందుకు ప్రముఖులు వస్తున్నారు. వారితో యశోదాలో రోగులకు ఇబ్బంది ఎదురవుతోంది. రావొద్దని కూడా కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌కు ఆపరేషన్ నొప్పి తగ్గి, సాధారణ నొప్పి మాత్రమే ఉన్నదని, ఆయన శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు కూడా చేయిస్తున్నామని చెప్పారు. మరికొన్ని రోజులు ఫిజియోథెరపీ కొనసాగించాల్సి ఉంటుందని ప్రకటించారు. వారం కిందట ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ జారిపడటంతో ఆయన్ను సోమాజిగూడలోని యశోద హాస్పిటల్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. సీటీ స్కాన్ చేసిన డాక్టర్లు.. తుంటి ఎముక విరిగినట్టుగా గుర్తించారు. శుక్రవారం ఉదయం ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత్రి హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేశారు.

కేంద్ర మంత్రిగా ఉన్న సమయమంలోనూ కేసీఆర్ ఓ సారి ఢిల్లీలో బాత్ రూంలో జారి పడ్డారు. దాంతో అప్పుడు కూడా ఆయనకు తుంటి ఆపరేషన్ జరిగింది. ఈ సారి రెండో వైపు ఆపరేషన్ జరిగింది. అయినా కేసీఆర్ మానసికంగా ధృడంగా ఉన్నారని.. ఆస్పత్రిలో పుస్తకాలు చదువుతున్నారని ఎంపీ సంతోష్ రావు తెలిపారు.

సంపాదకీయం

పార్లమెంట్ ఎంత భద్రం

సరిగ్గా 22 ఏళ్ల క్రితం. డిసెంబర్ 13. ఉదయం 11.40 నిముషాల సమయం. పార్లమెంట్ హౌజ్ కాంప్లెక్స్‌లోకి ఓ అంబాసిడర్ కార్ దూసుకొచ్చింది. ఆ కార్‌కి రెడ్ లైట్ బిగించి ఉంది. అంతే కాదు. హోమ్ మినిస్ట్రీ స్టికర్ కూడా ఉంది. అందులో ఐదుగురు ఉగ్రవాదులున్నారు. ఆ స్టికర్‌ని ఫోర్జరీ చేసి అతికించారు. పార్లమెంట్ బిల్డింగ్ గేట్ నంబర్ 12 వైపుగా దూసుకెళ్తున్న కార్‌ని చూసి పార్లమెంట్ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. సరిగ్గా అదే సమయంలో కార్‌ని చాలా వేగంగా వెనక్కి తిప్పారు. అది కాస్తా అప్పటి ఉపరాష్ట్రపతి కృష్ణ కాంత్ వెహికిల్‌ని బలంగా ఢీకొట్టింది. అప్పుడే ఉగ్రవాదులు కార్‌లో నుంచి దిగి కాల్పులకు తెగబడ్డారు. వెంటనే పార్లమెంట్ సెక్యూరిటీ అప్రమత్తమైంది. సెక్యూరిటీ అలారం మోగింది. బిల్డింగ్ గేట్స్ అన్నీ మూసేశారు. ఈ ఘటన జరిగిన సమయంలో పార్లమెంట్ లోపల దాదాపు 100 మంది మంత్రులు, ఎంపీలున్నారు. దాదాపు అరగంట పాటు సెక్యూరిటీ సిబ్బందికి ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి.

ఈ కాల్పుల్లో మొత్తం 5గురు ఉగ్రవాదులూ ప్రాణాలు కోల్పోయారు. వాళ్లతో పాటు 8 మంది సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఓ గార్డెనర్ బలి అయ్యారు. 15 మంది గాయపడ్డారు. ఆ సమయంలో ఎల్‌కే అద్వాణి హోం మంత్రిగా ఉన్నారు. పాకిస్థాన్‌కి చెందిన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలకు చెందిన ఉగ్రవాదులు ఈ దాడులకు పాల్పడ్డారు. ఆ ఐదుగురు ఉగ్రవాదులూ పాకిస్థాన్‌కి చెందిన వాళ్లేనని, భారత్‌తో కొంత మందితో వాళ్లకు సంబంధాలున్నాయని ?అద్వాణి అప్పట్లో ప్రకటించారు. ఈ ఘటన అప్పుడు మొత్తం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ ఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఈ ఘటనతో సంబంధం ఉన్న నలుగురుని అరెస్ట్ చేసింది. వాళ్లలో జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ మిలిటెంట్ మహమ్మద్ అఫ్జల్ గురుతో పాటు షౌకత్ హుసేన్ గురు, షౌకత్ భార్య అఫ్సన్ గురు, అరబిక్ యూనివర్సిటీకి చెందిన లెక్చరర్ జిలానీ ఉన్నారు. వీళ్లో ఒక్క అఫ్సన్‌కి తప్ప మిగతా ముగ్గురికీ మరణశిక్ష విధించారు. 2003లో గిలానీ నిర్దోషిగా విడుదలయ్యాడు. 2005లో సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. షౌకత్ హుసేన్ గురు ఉరిశిక్షని రద్దు చేసి పదేళ్ల జైలు శిక్ష విధించింది. అఫ్జల్ గురుకి మాత్రం ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. 2006 సెప్టెంబర్ 26న అఫ్జల్‌కి ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. 2013 ఫిబ్రవరి 9న ఉరి తీశారు. ఇది జరిగిన 22 ఏళు పూర్తైన రోజే మరోసారి పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం బయటపడడం సంచలనం సృష్టించింది. అంత భద్రతను దాటుకుని లోక్‌సభలోకి ఇద్దరు ఆగంతకులు ఎలా దూసుకొచ్చారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మధ్యాహ్నం జీరో అవర్ జరిగే సమయంలో ఈ ఘటన జరిగింది. గ్యాస్ క్యానిస్టర్స్‌తో ఇద్దరు వ్యక్తులు విజిటర్స్ గ్యాలరీలో నుంచి సభలోకి దూసుకొచ్చారు.

మైసూరుకి చెందిన సాగర్ శర్మ, మనోరంజన్ సభలోకి వచ్చినట్టు గుర్తించారు. పార్లమెంట్ బయట నీలం, అమోల్ శిందే అనే మరో ఇద్దరు వ్యక్తులు నినాదాలు చేశారు.ఇవాల్టి దాడిని నిషేధిత సిక్ ఫర్ జస్టిస్ అనే సంస్థ చేసిందా అనే అనుమానాలు వస్తున్నాయి. గత కొద్ది రోజుల క్రితమే సిక్ ఫర్ జస్టిస్ నేత, ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ ఓ వీడియో విడుదల చేశారు. 2001 డిసెంబర్ 13వ తేదీన పార్లమెంట్ పై దాడి జరిగింది. ఇప్పుడు కూడా అదే రోజు లేదా అంతకు ముందే మేం దాడి చేస్తామన్నది ఆ వీడియో సారాంశం. తనను హత్య చేయడానికి భారతదేశ భద్రతా సంస్థలు కుట్ర పన్నాయని దానికి నిరసనగా పార్లమెంట్ పై దాడి చేస్తామని చెప్పారు.గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర జరిగిందని దాన్ని అడ్డుకున్నట్లు అమెరికా నిఘా సంస్థలు చెప్పినట్లు వార్తలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో ఇవాల్టి దాడి ఖలిస్తాన్ ఉగ్రవాదుల పనేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా పార్లమెంట్ పై 22 ఏళ్ల క్రితం జరిగిన దాడి రోజే దాడి జరగడం, ఇలా దాడి చేస్తామని గురపత్వంత్ సింగ్ పన్నూ బెదిరింపు వీడియోను విడుదల చేయడం అన్నట్లుగానే పార్లమెంట్ లో ఇద్దరు అగంతకులు ప్రవేశించి ప్రేక్షకుల గ్యాలరీ నుండి పార్లమెంట్ లో దూకడం వంటి సంఘటనలు అందరినీ విస్మయపరుస్తున్నాయి. ఎల్లో కలర్ గ్యాస్ ను పార్లమెంట్ లో స్ప్రే చేస్తూ, నినాదాలు చేయడం భద్రతా సంస్థల నిఘా వైఫల్యాన్ని చాటి చెబుతున్నాయి. ఖలిస్తాన్ ఉగ్రవాది హెచ్చరికల నేపథ్యంలో ఈ ఇద్దరు అగంతకులు పార్లమెంట్ లో ప్రవేశించడం, వారితో పాటు మరో ఇద్దరిని భద్రతా సంస్థలు పార్లమెంట్ వెలుపల అదుపులోకి తీసుకున్నాయి. ఆ ఇద్దరి పాత్ర ఏంటి. ఆ అగంతకులు ఖలిస్తాన్ ఉగ్రవాదులా, లేకా పాక్ ప్రేరిత ఉగ్రవాదులా అన్న చర్చ సాగుతోంది. ఎవరి సాయంతో పార్లమెంట్ లోకి ప్రవేశించారన్న అంశంపై కేంద్ర నిఘా సంస్థలు, దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఏది ఏమైనా 2001 పార్లమెంట్ దాడి తర్వాత మళ్లీ 22 ఏళ్లకు అదే రోజు ఈ దాడి జరగడం మన భద్రతా సంస్థల వైఫల్యంగానే చెప్పాలి. మొత్తం నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సభలో టియర్ గ్యాస్ ప్రయోగించడం వల్ల ఎంపీలు పరుగులు పెట్టారు. స్పీకర్ ఓం బిర్లా వెంటనే సభను రద్దు చేశారు. తరవాత కాసేపటికి మళ్లీ సభ మొదలైంది.

జగిత్యాల వాణిజ్య శాఖ కార్యాలయంలో అధికారుల సోదాలు

జగిత్యాల - ప్రభాత సూర్యుడు :

జగిత్యాల వాణిజ్య శాఖ కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేసారు. కోట్ల రూపాయల జీఎస్టీ ఎగవేత జరిగినట్టు అనుమానాలతో సోదాలు చేసారు. స్టేట్ వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు ఈ సోదాలు చేసారు. మెయిల్ ఐడి, ఫోన్ నెంబర్ మార్పుతో ఫేక్ బిల్లులు చెల్లించనట్టు అనుమానాలు వున్నాయి. రద్దయిన సొసైటీల పేరుతో ఫేక్ బిల్లులు ద్వారా విక్రయాలు జరిగినట్టు సమాచారం . జగిత్యాలలో గతంలో ఓ ఆడిటర్ దగ్గర పనిచేసిన వ్యక్తి ఈ మోసానికి పాల్పడ్డట్టు వార్తలువచ్చాయి. ఆ వ్యక్తిపై గతంలో పలు కేసులు నమోదు అయ్యాయి. ఆ వ్యక్తి వారం రోజుల క్రితం 60 లక్షల కట్టారు. జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నారు.

ప్రతిపక్షనేత హోదాలో కేసీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ఎన్నికల ఫైట్ ముగిసింది. ఆ ఫైట్ లో కాంగ్రెస్ ను అధికార పార్టీగా కూర్చోబెట్టిన ఓటర్లు, అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు ప్రతిపక్ష హోదా కట్టబెట్టారు. ఇప్పుడు ఆ రెండు పార్టీల స్థానాలు మారినా ఫైట్ మాత్రం కామనే. అయితే ఇప్పుడు నిన్న మొన్నటిదాకా సాగిన ఎన్నికల సమరం కాస్తా అసెంబ్లీ ఫైట్ గా మారనుంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార పార్టీ 64 మంది సభ్యులతో, ఒక్క సీపీఐ ఎమ్మెల్యే మద్దతుతో, ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. మరో వైపు 39 ఎమ్మెల్యేలతో గులాబీ పార్టీ, 8 మంది ఎమ్మెల్యేలతో కమలం పార్టీ, 7 గురు ఎమ్మెల్యేలతో ఎం.ఐ.ఎం పార్టీ ఈ కొత్త అసెంబ్లీలో కొలువు తీరనున్నాయి. ఇవన్నీ కాంగ్రెస్ టార్గెట్ గా పని చేయనున్నాయి.తెలంగాణ తెచ్చిన పార్టీగా టీఆర్ఎస్ గత రెండు ఎన్నికల్లో (2014,2018) పోటీ చేసి అధికార పక్షంగా అసెంబ్లీలో వ్యవహరించింది. రెండో టర్మ్ లో బీఆర్ఎస్ కు ప్రతిపక్ష పార్టీయే లేని పరిస్థితి. 2014లో కాంగ్రెస్, టీడీపీలో మెజార్టీ ఎమ్మెల్యేలు అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో అధికార పార్టీ హోదాలో ఉన్న టీఆర్ఎస్ కు అసెంబ్లీలో ఎదురే లేని పరిస్థితి. అయితే శాసన మండలిలో మాత్రం విపక్షాల సభ్యులు ఎక్కువ ఉండటంతో ఆయా అంశాలపై ఎక్కువ సమయం చర్చ జరిగేది. కాని శాసనసభలో మాత్రం ఏకపక్ష చర్చ సాగేది. 2018లోను అదే పరిస్థితి. 2018లోను కాంగ్రెస్ ది అదే పరిస్థితి. రేవంత్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి నేతలు ఆ ఎన్నికల్లో ఓడిపోగా, భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు వంటి నేతలు కొంత ప్రయత్నించినా అధికార పార్టీని నిలదీసే పరిస్థితి ఏ మాత్రం లేదు. టీడీపీ పూర్తిగా కనుమరుగయింది. వామపక్షాలదీ అదే పరిస్థితి.

కాంగ్రెస్‌లో నామినేషన్ పోస్టులకు పోటీ

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు :

రాష్ట్రంలో కొత్త సర్కార్ కొలువు దీరింది.. పదేళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నేతలు ఇక నామినేటెడ్ పోస్టుల కోసం పరుగులు మొదలు పెట్టారు. గత బీఆర్ఎస్ సర్కార్‌లో కార్పోరేషన్ చైర్మన్లుగా అత్యధికంగా ఓరుగల్లు వాసులు దక్కించుకోగా, ఇదే తరహాలో రేవంత్ రెడ్డి సర్కార్ లోనూ వరంగల్‌కు ప్రాధాన్యత ఉంటుందని ఆరాట పడుతున్నారు. లోకల్ ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు, రాష్ట్రస్థాయిలో తమకున్న పరిచాయాలతో ఆశావాహులు తెగ పావులు కదుపుతున్నారు?రాష్ట్ర రాజకీయాల్లో ఓరుగల్లుకు ఎప్పుడూ ప్రత్యేక స్థానమే.. ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వరకూ ఇదే సీన్ కొనసాగుతూ వస్తోంది. ఉద్యమాల నుంచి రాజకీయాల వరకూ ఇక్కడ నేతలు రాష్ట్ర రాజకీయాల్లో కీ రోల్ గా మారుతున్నారు. తమకంటూ ఓప్రత్యేకతను చాటు కున్నారు. మొన్నటి సాధారణ ఎన్నికల్లోనూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ప్రత్యేక మార్క్ సాధించింది.. 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 10 స్థానాలను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కైవసం చేసుకున్నారు.రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో ఇద్దరు మహిళా మంత్రులు ఉంటే ఆ ఇద్దరు ఓరుగల్లు ఆడబిడ్డలే కావడం విశేషం. వారికి కీలకమైన శాఖలు దక్కాయి. ఇదే తరహా కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు దక్కుతాయని వరంగల్ కు చెందిన కాంగ్రెస్ లీడర్లు తెగ ఆరాట దుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ దక్కని నేతలు, పోటీ చేసిన అభ్యర్థుల గెలుపులో కీలకంగా వ్యవహరించిన నేతలు, సీనియర్ కాంగ్రెస్ నేతలు ఒక్క ఛాన్స్ అంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవల దిస్తున్న లీడర్లు ఇప్పుడు తమ పార్టీ అధికారంలోకి రావడంతో ఇక పదవుల కోసం పరుగులు పెడుదుతున్నారు.బీఆర్ఎస్ సర్కార్ లో ఎక్కువ మంది వరంగల్ నుంచి వివిధ కార్పోరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి.. రాష్ట్ర వికలాంగుల చైర్మన్ గా కే.యూ విద్యార్థి నేత వాసుదేవ రెడ్డి బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర రైతు బంధు సమితి చైర్మన్‌గా డాక్టర్ తాడికొండ రాజయ్య, హస్తకలల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా బొల్లం సంపత్ కుమార్, తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ వి. ప్రకాశ్ రావు, రాష్ట్ర రైతు రుణ విముక్తి కార్పోరేషన్ చైర్మన్ గా నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మెట్టు శ్రీనివాస్, ఆర్టీసీ చైర్మన్ గా ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్య ? సంక్షేమ, మౌలికవసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రావుల శ్రీధర్‌రెడ్డి కొనసాగారు.వీరందరి పదవులను రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది.. కేబినెట్ హోదా కలిగిన పదవులతో పాటు కుడా చైర్మన్, జిల్లా స్థాయి కార్పోరేషన్లు, మార్కెట్ కమిటీలు, దేవాలయాల కమిటీలు? అనేక ఉన్నాయి. రాష్ట్ర స్థాయి కేబినెట్ హోదా కలిపి కార్పోరేషన్ చైర్మన్ పదవుల కోసం ఇప్పుడు కాంగ్రెస్ లీడర్లు అనేక మంది పోటీ పడుతున్నారు.. వివిధ సమీకరణలతో ఒక్కఛాన్స్ అంటున్నారుపార్టీకోసం శ్రమించిన వారు వేట ముమ్మరం చేశారు. అలాంటి వారిలో మాజీ ఓఎం వేం నరేందర్ రెడ్డి, మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ ఓఅ రేసులో ఉన్నారు. సీనియర్ నాయకుడు ఇఎ శ్రీనివాస్, బట్టి శ్రీనివాస్, అజీజ్ ఖాన్, ఇనగాల వెంకట్రామిరెడ్డి, నిమినీడ్ల శ్రీనివాస్, పైడాకుల అశోక్, బాదం ప్రవీణ్, మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, జంగా రాఘవరెడ్డి, భరత్ చంద్రరాడెడ్డి, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి ఇలా చెప్పు కుంటూ పోతే పెద్దలీస్టే తయారవుతుంది? ఇప్పటికే ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులపై దృష్టిపెట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియమించిన 54 కార్పోషన్ చైర్మన్లను తొలిగించింది. దీంతో ఆశావాహులు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ లోనూ వరంగల్ కు నామినేటేడ్ పోస్టుల్లో పెద్దపీట వేస్తారా..? .వరంగల్ జిల్లా వాసులకు ఎంత మందికి పోస్టులు దక్కుతాయే తెలియాలంటే మరికొంత కాలం వేచి ఉండాల్సిందే.

15 మంది ఎంపీల సస్పెండ్

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు :

పార్లమెంట్‌లో ఒక్కరోజే 15 మంది ఎంపీలు సస్పెండ్ అయ్యారు. ప్రొసీడింగ్స్ సమయంలో సభకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినందుకు సస్పెన్షన్ వేటు వేశారు. వీరిలో 14 మంది లోక్‌సభకు చెందిన ఎంపీలుండగా..మరొకరు రాజ్యసభ ఎంపీ. కనిమొళి కరుణానిధి, మాణికం ఠాగూర్, పీఆర్ నటరాజన్ సహా పలువురు ఎంపీలపై ఈ వేటు పడింది. రాజ్యసభ ఽఓఅ ఎంపీ డెరెక్ ఒబ్రియెన్ సస్పెన్షన్‌కి గురైన కాసేపటికే 14 మంది ఎంపీలూ సస్పెండ్ అయ్యారు. పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై రెండు సభల్లోనూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేశారు. దీనిపై చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టారు. ఈ కారణంగా ప్రొసీడింగ్స్‌కి అంతరాయం కలిగింది. ముఖ్యంగా కాంగ్రెస్ ఎంపీలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. హోం మంత్రి అమిత్‌షా ఈ ఘటనపై స్టేట్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల కారణంగా సభ సజావుగా సాగలేదు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఆ ఎంపీలందరినీ సస్పెండ్ చేస్తూ ఓ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే జోషి కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇప్పటికే హోంశాఖకి లేఖ రాశారని వివరించారు. ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరినట్టు వెల్లడించారు. కానీ... ప్రతిపక్షాలు మాత్రం దీన్ని రాజకీయం చేయాలని చూస్తున్నాయని మండి పడ్డారు. “పార్లమెంట్ హౌజ్ భద్రతపై స్పీకర్ రివ్యూ చేశారు. హోం శాఖ సెక్రటరీకి ఇప్పటికే ఓం బిర్లా లేఖ రాశారు. ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి”భద్రతా వైఫల్యంపై మోడీ రివ్యూ పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై రెండు సభల్లోనూ పెద్ద ఎత్తున వాదనలు జరిగాయి. కచ్చితంగా దీనిపై చర్చ జరగాల్సిందేనని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. ఈ విషయంలో చాలా సేపటి వరకూ అలజడి కొనసాగింది. రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్‌తో గొడవ పడినందుకు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్‌ని సస్పెండ్ చేశారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ అత్యున్నత స్థాయి భేటీకి పిలుపునిచ్చారు. భద్రతా వైఫల్యంపై చర్చించేందుకు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సీనియర్ మంత్రులతో పాటు భద్రతా అధికారులు, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, అనురాగ్ ఠాకూర్ హాజరయ్యారు. అటు ఎ.ఔ.ఆ.ఎ.ం కూటమి నేతలు కూడా సమావేశమయ్యారు. భద్రతా వైఫల్యంపై సభలో ఏం మాట్లాడాలో ఈ భేటీలో చర్చించుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. భద్రతా వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు ప్రతిపక్ష ఎంపీలు. అంతే కాదు. ఇదే విషయంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మునీ కలవాలని భావిస్తున్నారు. అయితే...లోక్‌సభలో భద్రతా వైఫల్యంపై ఆందోళన చేసినందుకు గానూ ఐదుగురు కాంగ్రెస్ ఎంపీలు సస్పెండ్ అయ్యారు. క్రమశిక్షణా చర్యల కింద ఈ నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా ఈ ఆందోళనల కారణంగా ఆరుగురు ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ మేరకు అధికారికంగా ఓ తీర్మానం విడుదల చేశారు. ఐదుగురినీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

యాచారంలో నూతన టిఫిన్ సెంటర్ ప్రారంభం

-యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

యాచారం - ప్రభాత సూర్యుడు : యాచారం మండలం నందివనపర్తి గ్రామానికి చెందిన మల్లేపల్లి ప్రభాకర్ యాచారం గ్రామంలో నూతనంగా టిఫిన్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి. ఈ సందర్భంగా బిలకంటి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వయం ఉపాధి అంటే ఒక వ్యక్తి యజమాని కోసం పని చేయడం కంటే తానే యజమానిగా ఉండటానికి పని కల్పించుకోవడం. ప్రధానంగా తను చేస్తున్న పనికి తానే యజమాని ఇంకా ఇతరులకు అతని ఆధ్వర్యంలో పని పొందే అవకాశం కూడా ఉందని అన్నారు.వ్యాపారం పరంగా మంచి లావాదేవిలు సాధించాలని వారిని దీవించారు. టిఫిన్ సెంటర్ ప్రారంభోత్సవానికి పాల్గొన్నందుకు కుటుంబసభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పంది సుధాకర్, ముచ్చర్ల వెంకటరమణ, సామ బాలరాజు,జెనిగే వెంకటేష్,పంది రామచంద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ భూములు రైతులకు తిరిగి ఇవ్వండి

- మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి

ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు : ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి గురువారం పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాసిటీ రద్దు చేసే ప్రకటన సీఎం రేవంత్ రెడ్డి చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే రేవంత్ రెడ్డి ఫార్మాసిటీ రద్దు ప్రకటన చేశారని ఫార్మసిటీ రద్దు చేస్తే వెంటనే రైతులకు భూములు తిరిగి ఇవ్వండని ఫార్మాసిటీ తెచ్చింది ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. గతంలో ఇచ్చిన అభివృద్ధి పనులను యధావిదిగా కొనసాగించాలని మెట్రో రైలు కూడా యధావిధిగా కొనసాగించాలని కొత్త లైన్స్ ఇవ్వాలి అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఫార్మాసిటీ రద్దు చేస్తామని చెప్పి భూములు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. మెగా సిటీ, టౌన్ షిప్ సిటీ, ఏర్పాటుచేసి రియల్ ఎస్టేట్ చేయాలని భావిస్తున్నారు. ఇది మంచిది కాదని మీరు ఇచ్చిన హామీ రైతులకు తిరిగి భూములు ఇస్తామని చెప్పారు. ఇప్పుడు మీరు అదే రియాక్టర్లకు భూములు అప్పగించే విధంగా చూస్తున్నారని రైతులకు అన్యాయం జరిగితే రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఫార్మాసిటీ విషయంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున రాజకీయం చేస్తుందని ఆయన అన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి ఫార్మసిటీ ప్రకటన

స్పందించిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు : ఫార్మాసిటీ భూములతో కాంగ్రెస్ పార్టీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఫార్మాసిటీ ని రద్దుచేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేసి ఆభూములను రైతులకు తిరిగిఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారు. అదేవిధంగా ఫార్మాసిటీ ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించి అక్కడ శాటిలైట్ టౌన్షిప్‌లను ఏర్పాటు చేస్తామని మాట మార్చారు. అక్కడ టౌన్షిప్ ల ఏర్పాటు అనేది రియల్ ఎస్టేట్ వ్యాపారం కాకుంటే ఇంకేంటని ప్రశ్నించారు. ఫార్మాసిటీ ఏర్పాటు ప్రతిపాదనే గతంలో కాంగ్రెస్ తీసుకు రావడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రపంచం మెచ్చే గ్రీన్ ఫార్మాసిటీని, ఫార్మా యూనివర్సిటీని, టౌన్ షిప్ లను ఏర్పాటుచేస్తామంటే వ్యతిరేకించిన వారు వ్యాపారం అధికారంలోకి వచ్చి అక్కడ టౌన్షిప్ ల ఏర్పాటు చేస్తామనడం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం తగదని అన్నారు. రైతులకు భూములు తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అదేవిధంగా రైతులకు భూములు ఇచ్చేయలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ ను కలిసిన టీజీవో నాయకులు

జగిత్యాల - ప్రభాత సూర్యుడు : శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా పూర్తి చేసినందున బుధవారం ఐడివోసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషా ని మర్యాద పూర్వకంగా కలిశారు..ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారులు సంఘం తరపున కలిసి శుభాకాంక్షలు తెలిపారు...ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇది ఉద్యోగులందరిది సమిష్టి కృషి వల్ల జరిగిన విజయమని కొనియాడారు.. అలాగే భవిష్యత్తులో జరిగే ఎన్నికలు కూడా మన అందరి సమిష్టి కృషితో విజయవంతం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ , ప్రధాన కార్యదర్శి మామిడి రమేష్ ,అసోసియేట్ కందుకూరి రవిబాబు, విజేందర్, విశ్వాన్ , ప్రభు, కిరణ్, హనుమంతరావు, సంగి రాజేశ్వరి, శైలజ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధికావాలి అంటే

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్
- ఇసి శేఖర్ గౌడ్ కు రాష్ట్ర స్థాయిలో
- నామినెట్ పదవి ఇవ్వాలి-ఉపాధి కల్పించే కంపెనీలు ఏర్పాటు చేయాలి

మంచాల - ప్రభాత సూర్యుడు : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి కావాలంటే మాల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ ఇబ్రహి ంపట్నం నియోజకవర్గం అభివృద్ధి చెందటంలో పూర్తిగా వెనక పడి పోయిందని అన్నారు .అది పాలకుల నిర్లక్ష్యమా ప్రభుత్వాల నిర్లక్ష్యమా కానీ పూర్తి స్థాయిలో అభివృద్ధి మాత్రం జరగలేదు. ఇబ్ర హింపట్నం నియోజకవర్గంలో గిరిజన తండాలు అధికం కొండ ప్రాంతాలు ఎక్కువ ఇక్కడి ప్రాంతం ప్రజలు అధిక శాతం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు హైదరాబాద్ నగరానికి కుత వేటు దూరంలో ఉన్న అబి వృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది అన్నారు. ఇబ్రహింపట్నం నియోజకవంం పూర్తి స్థాయిలో అభివృద్ధి కాక పోవటం సిగ్గు చేటు అన్నారు .నియోజకవర్గంలోని మంచాల మండలం జపాల గ్రామంలో ఉస్మానియా యూనివర్సిటీకి సంబందించిన ప్రపంచంలోనే రెండవది నక్షత్రశాల అభివృద్ధి కాలేదు ఆరుట్ల గ్రామంలో ఉన్న దక్షణ కాశీగా పేరు ఉన్న బుగ్గ రామలిగేశ్వరస్వామి ఆలయం అబివృద్ధి కాలేదు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే కంపెనీలు ఏర్పాటు చేయలేదు. యాచారం మండలంలో విషం చిమ్మే పార్మకంపెనీలు తప్ప తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదు అసైన్ మెంట్ ప్రభుత్వ భూముల్లో పొడు భూముల్లో సాగు చేసుకోని పంటలు పండించు కోని జీవనం సాగిస్తున్న పేద రైతులకు ధరణి పోర్టల్ వచ్చిన తరువాత ఈ పాస్ బుక్ లు కూడా పంపిణీ చేయలేదు రైతుల భూమి వివరాలు మొత్తం అన్‌లైన్‌లో లేకుండా తొలగించారు. ఎ ఒక్క గిరిజన తండాలకు కానీ గ్రామాలకు కానీ కొత్తగా ఒక్క బిటి రోడ్లు వేయలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్వర్గీయ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్దే కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే బంగారు తెలంగాణ రాష్ట్రం గా చేస్తాను అని గొప్పలు చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసిర్ అప్పుల తెలంగాణ రాష్ట్రం గా మార్చి గద్దె దిగాడు అన్నారు .ఇబ్రహింపట్నం నియోజకవర్గం మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి నియోజకవర్గని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయటంలో పూర్తిగా విపలం అయ్యాడు ఇబ్రహింపట్నం నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగాలి అంటే రైతులకు నిజమైన న్యాయం జరగాలంటే ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే అది మన డైనమిక్ నాయకుడు అభివృద్ధి చేయటంలో అనుభవస్తుడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కేసాద్యం.అందుకే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి మల్ రెడ్డి రంగారెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలి సీనియర్ నాయకుడు ఇసి శేఖర్ గౌడ్‌కు రాష్ట్ర స్థాయిలో నామినేట్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలను మీడియా ద్వారా కోరుకుంటున్నాం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి మంత్రి పదవి ఇస్తే రాబోయే లోకల్ ఎన్నికలో పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు వస్తుంది అన్నారు.

బుగ్గారం జి.పి.నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

- విజిలెన్స్ - ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ జనరల్‌కు పిర్యాదు
- అవినీతి మత్తులో పంచాయతీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు
- నాలుగేండ్లుగా న్యాయం జరగడం లేదని ఆరోపణ
- చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ ను కోరిన చుక్క గంగారెడ్డి

జగిత్యాల - ప్రభాత సూర్యుడు : జగిత్యాలజిల్లా బుగ్గారంగ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం, అధికారుల నిర్లక్ష్యం పై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఉన్నతాధికారి అయిన డైరెక్టర్ జనరల్ కు గురువారం చుక్క గంగారెడ్డి పిర్యాదు చేశారు. కోటికి పైగా నిధులు దుర్వినియోగమై, జి.పి. రికార్డులు కూడా మాయం చేసినప్పటికీ పంచాయతీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు అవినీతికి పాల్పడి పట్టించు కోవడం లేదన్నారు. గత నాలుగు ఏండ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విజిలెన్స్ కు ఇచ్చిన పిర్యాదులో చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు. మూడు సార్లు నామ మాత్రంగా విచారణ జరిపిన పంచాయతీ అధికారులు కేవలం రూ.4,58,924-00 మాత్రమే రికవరీ చేశారని తెలిపారు. అయినా సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయలేదని ఆయన ఆరోపించారు.అవినీతి మత్తులో ఉన్న సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులు వారి అత్యంత విలువైన అధికారాన్ని కూడా దుర్వినియోగం చేశారని పిర్యాదులో వాపోయారు. అనేక ఆర్టీఐ దరఖాస్తులకు పంచాయతీ అధికారులు, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఉన్నతాధికారులు సైతం సమాచారం ఇవ్వడం లేదన్నారు. గౌరవ తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఇచ్చిన 18 కేసుల తీర్పులను సైతం బేఖాతర్ చేశారని, గౌరవ జిల్లా కలెక్టర్ జారీ చేసిన అనేక ఆదేశాలను కూడా జిల్లా పంచాయతీ అధికారులు బే ఖాతర్ చేస్తున్నారని ఆయన విజిలెన్స్ అధికారులకు ఇచ్చిన పిర్యాదులో ఆరోపించారు. తక్షణమే బుగ్గారం సర్పంచ్ మూల సుమలత ను, ఉప సర్పంచ్ ని, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను, పాలక వర్గాన్ని, బాధ్యులైన అధికారులను, అత్యంత విలువైన విధులను కూడా దుర్వినియోగం చేసిన ఉన్నతాధికారులను సైతం వెంటనే సస్పెండ్ చేస్తూ బాధ్యులైన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఆయన విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ జనరల్‌ను కోరారు.ర్డులు సృష్టించి లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారని ఆయన పిర్యాదు లో పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా కలెక్టర్ వరకు అనేక సార్లు మేము చేసిన పిర్యాదులపై చర్యలు శూన్యం అయ్యాయని ఆరోపించారు. మూడు సార్లు జరిపిన విచారణ పారదర్శకంగా, న్యాయంగా, చట్టబద్ధంగా కొనసాగలేదన్నారు. జరిగిన నిధుల దుర్వినియోగం వాస్తవ ఆధారాలతో సహా అధికారుల విచారణలో లభించినా వాటిని కప్పి పుచ్చడం జరిగిందన్నారు. అధికారులు నిర్వహించిన క్షేత్ర స్థాయి విచారణలో సాక్షాత్తు గ్రామ ప్రజల ముందు బయట పడ్డ నిధుల దుర్వినియోగాన్ని కూడా విచారణ అధికారులు, ఉన్నతాధికారులు కలిసి కట్టుగా కుమ్మక్కై వాస్తవ దుర్వినియోగాన్ని కూడా కప్పి పుచ్చారని తెలిపారు. ఇట్టి నిధుల దుర్వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై గౌరవ లోకాయుక్త (కోర్టు) కు కూడా పిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆ కేసులో కూడా అధికారులు కావాలనే న్యాయ స్థానానికి తప్పుడు సమాచారం అందజేశారని ఆరోపించారు. తమరి ద్వారా పూర్తి స్థాయిలో తగు విచారణ చేపడితే మరింత భారీ మొత్తంలో నిధుల దుర్వినియోగం బయటపడే అవకాశం ఉందని విజిలెన్స్ ఙ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులకు ఆయన సూచించారు. తక్షణమే పకడ్బందీగా సమగ్ర విచారణ వేగవంతంగా జరిపించి మా నాలుగేండ్ల న్యాయ పోరాటానికి, బుగ్గారం గ్రామ ప్రజలకు తగు న్యాయం చేస్తూ, మొత్తం దుర్వినియోగాన్ని వెలికి తీసి, తగు వడ్డీతో సహా దుర్వినియోగం అయిన సొమ్ము మొత్తాన్ని రికవరీ చేయించాలని కోరారు. బాధ్యులైన వారందరిని చట్టపరంగా, కఠినంగా శిక్షించాలని విజిలెన్స్ ఙ ఎన్ ఫోర్స్ మెంట్ ఉన్నతాధికారులను చుక్క గంగారెడ్డి కోరారు.

పార్లమెంట్ నిందితుల నేపథ్యం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు : లోక్‌సభపై దాడి చేసిన నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే కీలక నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. మొత్తం ఆరుగురు కలిసి 18 నెలలుగా దాడికి ప్లాన్ చేస్తున్నట్టు తేలింది. సాగర్ శర్మ, మనోరంజన్ సభలో దాడి చేయగా...అమోల్ శిందే, నీలం దేవి పార్లమెంట్ బయట నినాదాలు చేస్తూ టియర్ గ్యాస్ప్రయోగించారు. ఈ ఘటనతో మరో ఇద్దరికీ సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. వాళ్లలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. వీళ్ల బ్యాగ్రౌండ్‌పై విచారణ కొన సాగిస్తున్నారు. ఏ సంస్థతో అయినా వీళ్లకుసంబంధం ఉందా..? ఎవరైనా కావాలనే రెచ్చగొట్టి ఈ పని చేయించారా అన్న కోణంలో ఇన్వెస్టిగేట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే వాళ్ల బ్యాగ్రౌండ్ గురించి ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి. నిందితుల్లో ఒకరైన మనోరంజన్‌కి మైసూరు ఎంపీ ప్రతాప్ సింహాకి కొంత పరిచయం ఉంది. మైసూరులోనే ఉంటున్న మనోరంజన్ తెలిసిన వాళ్ల ద్వారా ఎంపీని పరిచయం చేసుకున్నాడు. తండ్రి దేవరాజే గౌడ చెప్పినవివరాల ప్రకారం...మనోరంజన్ 2016లో బ్యాచ్‌లర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ప్రస్తుతం వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. ఢిల్లీ, బెంగళూరులో కొన్ని రోజులు ఉద్యోగం చేసినా..తరవాతపూర్తిగా వ్యవసాయమే చేస్తున్నాడు. సమాజానికి ఏదోటి చేయాలనే తపన తన కొడుకులో ఎప్పుడూ కనిపిస్తూ ఉంటుందని దేవరాజే గౌడ వెల్లడించారు. స్వామి వివేకానంద పుస్తకాలు ఎక్కువగాచదువుతాడని వివరించారు.

ఉద్యోగం లేదన్న అసహనంతో..ఇక లక్నోకి చెందిన సాగర్ శర్మకి, మనోరంజన్‌కి పరిచయముంది. ఆ పరిచయంతోనే ఎంపీ ప్రతాప్ సింహా ఆఫీస్‌కి తీసుకెళ్లాడు. తన ఫ్రెండ్ అని చెప్పాడు. అలా పాస్ సంపాదించాడు. సాగర్ శర్మ సోషల్ మీడియా పోస్టులు అన్నీ భగత్ సింగ్, మార్క్సిజం,చేగువెరా సిద్ధాంతాలతో నిండిపోయాయి. మూడో నిందితుడు విశాల్ శర్మ ఆటోరిక్షా డ్రైవర్‌గా పనిచేసే వాడు. ఈ మధ్యే భార్యతో గొడవ జరిగినట్టు స్థానికులు చెప్పారు. ఈ దాడి వెనకాల విశాల్ శర్మ భార్య హస్తం కూడా ఉండి ఉంటుందని అనుమానిస్తున్నారు. నిందితుల్లో ఒకరైన నీలం దేవి హరియాణావాసి. పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతోంది. ఓం,ఃఇట,ఓ.ఇట,ఓ.ఖష్త్రతిశ్రీతో పాటు ఔఖ ఎగ్జామ్‌ని కూడా క్లియర్ చేసింది. టీచర్ ఉద్యోగం కోసం నిరీక్షిస్తోంది. పార్లమెంట్ బయట కలర్ టియర్గ్యాస్ ప్రయోగించిన ఇద్దరిలో ఈ యువతి కూడా ఉంది. ఉద్యోగం రాలేదని చాలా రోజులుగా తీవ్ర అసహనంతో ఉంటున్నట్టు ఆమె తల్లి వివరించారు. మహారాష్ట్రకు చెందిన అమోల్ షిందే గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. ప్లంబర్‌కి హెల్పర్‌గా చాలా రోజుల పాటు పని చేశాడు.

ఆ ఉద్యోగం నచ్చక మానేశాడు. గుడ్‌గావ్‌లోని ఓ ఇంట్లో మనోరంజన్, సాగర్, నీలం, అమోల్ కలిసే ఉంటున్నట్టు పోలీసుల విచారణలో తేలింది.ప్రస్తుతం వీళ్లందరినీ విచారిస్తున్నారు పోలీసులు. లలిత్ ఝా అనే ఓ లెక్చరర్ ఈ దాడి వెనకాల మాస్టర్ మైండ్ అని అనుమానిస్తున్నారు. పార్లమెంట్‌ని విజిట్ చేయాలని చెప్పి ప్రతాప్ సింహా ఆఫీస్ నుంచివిజిటర్ పాస్‌లు సంపాదించారు. ఆ తరవాత 5 కలర్ స్మోక్ క్యానిస్టర్‌లు కొనుగోలు చేసి దాడి చేశారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215